# రిపోయింది!

'భరణి'




శ్రీనివాసరావు చిరచిర లాడిపోతున్నాడు. తన చిరాకుని ఎవరి మీద ప్రదర్శించాలో తెలియడం లేదు. చీటికీ మాటికీ పద్మావతిని కసురుకుంటున్నాడు. 'ఇలా నడు!', అలా చూడకు!', 'పైట భుజాల మీద కప్పుకో!' 'ఉష్! అలా నవ్వుతావేమిటి రోడ్డు మీదా?' 'కాస్సేపు మాట్లాడకుండా నోరు మూసుకో!' అంటూ తెగ సాధిస్తున్నాడు.

'భార్యారూపవతీ శత్రుః' అని ఇందుకే అన్నారేమో! ఏరి కోరి చేసుకున్నందుకు కొరివితో తల గోక్కున్నట్టయింది. ప్రతీ వెధవా వెకిలి చూపు చూడటమే. ఎప్పుడు సందు దొరుకుతుందా, కాస్త రాసుకుంటూ పోదామా అని చూసే దగుల్బాజీ వెధవలే అందరూ! చీ...చీ! ఏం లోకం, ఏం కాలం! చివరికి దేవుడి సమక్షంలోకూడా ఈ నీచపు బుద్ధులేనా? పాపభీతి బొత్తిగా లేకుండా పోయింది. అయినా, ఏడుకొండలవాడు చూస్తూ ఎలా వూరుకుంటున్నాడు, కలికాలం! అయినా ఎక్కడ వూరుకుంటున్నాడ్లే? ఎక్కడి కక్కడ మండించేస్తున్నాడు లోకాన్ని! ఇన్ని బాధలు, ఇన్ని కష్టాలు... రాకేం జేస్తాయి? పాపం పండితే బద్దలవకుండా ఉంటుందా! దైవ దర్శనానికి క్యూలో నిలబడి దొంగచూపులు చూసే వెధవలకి కళ్ళు పోవూ? ఈ పెళ్ళాం కాదు గానీ, దీని మూలాన దేవుడి మీద ధ్యానమే కుదర్లేదు! అయినా, దీం తప్పేం ఉందిలే! అమాయకురాలు! తను మాత్రం ఏం జేస్తుంది? అప్పటికీ ఎలా చెబితే అలాగ ఒదిగి ఒదిగి ఉంటుంది పాపం. అంతా నా ఖర్మ! ప్రతీ అడ్డ గాడిదా చొంగ కారుస్తూ, తన పెళ్ళాన్నే చూస్తూ ఉంటే, ఎవడికైనా ఎంత గుండె మండుతుంది! ఎంత అవమానం...ఛీ!' శ్రీనివాసరావుకి అసహనంతో పిచ్చెత్తి పోతూంది.

పద్మావతి అతని వెనకాలే ఒద్దికగా నిలబడి ఉంది. భర్త తనని అస్తమానూ ఎందుకలా విసుక్కుంటాడో అర్థం కాదామెకు. ఒక విషయం మాత్రం తెలుసు— ఇంట్లో ఉన్నంతసేపూ తనని ఎంతో అపురూపంగా దేవతలా చూసుకుంటాడు. ఎప్పుడూ సాధారణంగా బయటికి తీసికెళ్ళడు. ఎప్పుడైనా ఖర్మగాలి బయటికి వెళ్ళవలసి వస్తే తిరిగి ఇల్లు చేరేదాకా ధుమధుమలాడి పోతుం దతని ముఖం. ఎవడో తన వేపు చూస్తే తనేం చేస్తుంది?

శ్రీనివాసరావు విజయవాడలో బాంక్‌లో పని చేస్తున్నాడు. ఈ మధ్యనే కొత్తగా పెళ్ళయింది. భార్య పల్లెటూరిది! పెద్ద చదువూ సంధ్యా ఏమీ లేదు గాని, పిల్ల కుందనబ్బొమ్మలా ఉంటుంది. పైగా మంచి సంప్రదాయం గల కుటుంబం వాళ్ళది.

శ్రీనివాసరావుకు దైవభక్తి, పాపభీతి ఎక్కువ. చాదస్తంకూడా ఎక్కువే.

తిరుపతిలో శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనం చేయించడం కోసం వచ్చాడు. ఇక్కడనుంచి శ్రీశైలం, భద్రాచలంకూడా వెళ్ళాలని ప్లాను!

"ఈ దిక్కుమాలిన వెధవ బస్సు ఇంత రాదు కాబోలు!" గట్టిగా విసుక్కున్నాడు శ్రీనివాసరావు.

అరగంట నించి అలా అలా పెరిగిపోతూన్న అతని అసహనాన్ని గుర్తించింది పద్మావతి. బస్సు రాకపోవడంతో బాటు మరో కారణంకూడా గుర్తించింది ఆమె. కొంచెం దూరంలో ఇద్దరు యువకులు నిలుచుని ఉన్నారు. కాలేజీ కుర్రాళ్ళ లాగా ఉన్నారు. అరగంట నుంచీ అదే పనిగా ఆమె కేసి చూస్తున్నారు. శ్రీనివాసరావునీ, ఆమెని నిర్భయంగా చేత్తోనే చూపిస్తూ మరీ మాట్లాడు కుంటున్నారు. ఎందుకో వూరికే పగలబడి నవ్వుతున్నారు.

వాళ్ళ చూపులు తన భార్యని నిలువునా గుడ్డలు వలిచేసి పరికిస్తున్నట్లు అనిపించి, కడుపు రగులుకు పోయింది శ్రీనివాసరావుకి.

'వీడెవడు ఈ కొత్త వెధవ! నల్లగా, తుమ్మ మొద్దులా ఎలా ఉన్నాడో చూడు! ఆ బట్టలు చూడు ఎంత షోగ్గా కట్టాడో! ఏమిటలా చూస్తాడు పద్మ కేసి? ఇటొస్తున్నాడూ... మీద కాని పడి కావిలించుకుంటాడా ఏం ఖర్మ.'

శ్రీనివాసరావు చిరాకుకి కొత్తగా గురైన ఆ నల్ల తుమ్మ మొద్దు . కోటి నాగులు!

• • •

కోటి నాగులు ఉదయం నుంచి చీకటి పడేదాకా వూరంతా చెడ దిరిగి తెగ అలిసి పోయాడు. అప్పటికి మూడు రోజుల నుంచీ తిరుపతి వూరంతా...నిలిచిన చోట నిలవకుండా కొండ మీద, కొండ కింద తెగ తిరిగాడు. ఇంక ఈ రోజుతో కాంప్ అయిపోయినట్లే!

కోటి నాగులు సంచార వ్యాపారి. అతను దేశమంతా తిరుగుతూ తన వ్యాపార వ్యవహారాన్ని కొనసాగిస్తాడు. గాలి వాటు ఎటు అనుకూలంగా ఉంటే అటు కొట్టుకు పోతాడు. ఏ ఒక్క చోటో ఎక్కువ రోజులు పాతుకు పోతే వ్యాపారం లాభసాటిగా నడవదు

ఆజానుబాహువు కోటి నాగులు. పాతిక ముప్పయి ఏళ్ళ మధ్య దృఢంగా ఉన్నాడు. మంచి డ్రెస్ టక్ చేశాడు. కాళ్ళకి ఎలివేటర్స్ నిగనిగ లాడుతున్నాయి. బస్సు కోసం ఎదురు చూస్తూ, బస్ స్టేషనంతా కలియ తిరుగుతూ ఆలోచిస్తున్నాడు కోటినాగులు.

'లేచినేళ బాగులేదు. బిజినెస్సు దెబ్బ తినిపించేసినాది ట్రిప్పు. పెట్టుబడి, ఖర్చులే గిట్టటం గగనమై పోయిందేటో! ఎంకన్న సామీ! ఇలాగ జేసినా వేటయ్యా?

శ్రీనివాసరావు మీద పడింది అతని దృష్టి. గంభీరంగా నడుస్తూ అటు వెళ్ళాడు. కాస్సేపు అతన్ని, పద్మావతిని తీక్షణంగా పరిశీలించాడు. సక్కని సుక్క లాగున్నా దీయమ్మ! లచ్చిందేవిలాగుంది! సిరివి దీప మెట్టుకో వచ్చు... అనుకున్నాడు. మరి కాస్సేపు వాళ్ళిద్దర్నీ పరిశీలనగా చూశాడు. ఎందుకనో పెదవి విరిచి మరో వైపుకి వెళ్ళాడు.

బస్ స్టేషనంతా మళ్ళీ మరోసారి పచారు చేశాడు. అందరి ముఖాల్లోకి చూస్తున్నాడు. పరిసరాలన్నీ పరిశీలిస్తున్నాడు. భారత దేశపు జనాభా అంతా బస్ స్టేషన్లో గుమిగూడిపోయిందా అన్నట్లు కిట కిటలాడిపోతోంది. వచ్చే యాత్రికులూ, వెళ్ళే యాత్రికులూ—బెంచీలమీద, నేలమీద ఎక్కడ చూసినా జనం.

'ఎంకన్నసామి మహిమ!' అనుకున్నాడు ఆ జనాన్ని చూస్తూ. మరి కాస్సేపు తర్వాత, 'ఏటి లాభం?... ఏం లాభం లేదు!' తనలో తనే ఏదో తర్కించుకుంటూ, మరో వైపు వెళ్ళాడు. శ్రీనివాసరావుకి కొంచెం దూరంలో ఉన్న ఇద్దరు కాలేజీ కుర్రాళ్ళని చూశాడు.

ఇద్దరూ దొరబాబుల్లా ఉన్నారు. ఖరీదైన బట్టలు వేసుకున్నారు. బూట్లు, వాచీలు, దాబూ దర్పంతో వెలిగిపోతున్నారు. ఇంగ్లీషూ, తెలుగు కలిపి ఏవేవో మాట్లాడుకుంటున్నారు గట్టిగా.

వాళ్ళ దగ్గరకు వెళ్ళాడు కోటినాగులు. బాగా దగ్గరకి వెళ్ళి, వాళ్ళ పక్కన నించొని వాళ్ళ మాటలు వింటున్నాడు. వాళ్ళ మాటల్నిబట్టి, వాళ్ళు నిరుద్యోగులనీ, ఎక్కడికో ఇంటర్వ్యూకి వెళుతున్నారని అర్థమైంది కోటినాగులుకి. మధ్య మధ్య వాళ్ళు పద్మావతి గురించి అసభ్యంగా మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ మాటలు వింటూ... 'ఎదవలు! ఎర్రెదవలు!... లాభంలేదు. ఏదీ ప్రయోజనం లేదు' అంటూ వితర్కించుకొంటున్నాడు.

రాత్రి ఎనిమిదవుతోంది. ఏలూరు వెళ్ళే సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్ వచ్చి ఆగింది.

•     •     •

కుడి వైపు వరుసలో వెనకనుంచి మూడో సీట్లో చోటు దొరికింది శ్రీనివాసరావుకి. కిటికీ దగ్గర ఎవరో ఒకామె ఉంది. ఆమె పక్క పద్మావతిని కూర్చోమని, తాను ఇటు చివర్న కూర్చున్నాడు.

ఆ యువకులిద్దరూ శ్రీనివాసరావు కూర్చున్న సీటుకి వెనక సీట్లో కూర్చున్నారు.

కాస్సేపు గేటు దగ్గరే ఆలస్యం చేసిన కోటినాగులు టికెట్ తీసుకుని వచ్చి, ఆ యువకు లిద్దరి పక్కన, ఇటుచివర్న —సరిగ్గా శ్రీనివాసరావుకి వెనకాల కూర్చున్నాడు.

ఆ యువకులిద్దరూ ఏవేవో మాట్లాడుకుంటూనే ఉన్నారు పైకి. కేవలమాత్రం ఎవరి ఆలోచనల్లో వాళ్ళు ఉన్నారు. ఇద్దరి ఆలోచనలూ తమ ముందు కూర్చొని ఉన్న పద్మావతిమీద ఉన్నాయి. ముందు సీటు పైనుంచి కనిపిస్తున్న ఆమె మెత్తని, ఒత్తైన నల్లని ఉంగరాల జుత్తు, సీటు దిగువనుంచి కనిపిస్తున్న ఆమె పట్టు చీర చెంగులు, వాటికింద ముద్దొస్తున్న తెల్లని పాదాల మడమలూ...ఆ యువకుల గుండెల్లో ఏదో గుబులు రేపుతున్నాయి.

కోటినాగులు వెనక్కి సీటుకి జార్లబడి కూర్చున్నాడు. ఒక్కసారిగా అతనికి తన మొత్తం అలసట అంతా తెలిసొచ్చింది. కళ్ళు భగ భగా మండిపోతున్నాయి. మూడురోజుల్నుంచి కంటిమీద కునుకు లేదు.

బస్సు బయలుదేరింది. చల్లని గాలి కిటికీల్లోంచి హాయిగా సోకుతోంది. బస్సులో లైట్లారిపోయి చీకటి ముసిరింది.

కనీసం పాదాల్నైనా చూసే అవకాశం పోయింది అనుకుని నిట్టూర్చారు యువకులు.

చల్లగాలి హాయిగా ఉన్నది. ఒక కునుకు లాగేద్దాం అనుకున్నాడు కోటినాగులు. అనుకుంటూనే జేబులోంచి సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె తీశాడు. ఫిల్టర్ కింగ్‌ని నోట్లో పెట్టుకుని అగ్గిపుల్ల గీశాడు. గాలికి ఆరిపోయింది. రెండు మూడు పుల్లలు వేస్ట్ అయ్యాక—

రెండు సీట్ల మధ్యకి, బాగా క్రిందికి వంగి అగ్గిపుల్ల గీశాడు. ఆ వెలుగులో అతని కంటబడింది ఒక బూటు కాలు. పక్కనున్న కుర్రాడు, తన బూటు కాలిని, పద్మావతి పాదం దగ్గర నుంచి చటుక్కున వెనక్కి లాక్కుంటుండగా కోటినాగులు కళ్ళబడింది.

'ఎదవ కక్కుర్తి!...ఎదవలు' అని నవ్వుకున్నాడు. నవ్వుకుంటూ, తల వంచి సిగరెట్ వెలిగించుకుంటూ ఉండగా అతని దృష్టి మరోసారి అటు పడింది. అతని కళ్ళల్లో ఏదో మెరుపు మెరిసింది! అతని బూటు కాలిలో కూడా అసంకల్పితంగా చాలా నెమ్మదిగా చిన్న కదలిక మొదలైంది!!

పద్మావతికి గుండెల్లో వణుకు, కంగారు బయలుదేరాయి! ఇబ్బందిగా అటూ ఇటూ కదుల్తోంది. కాలు ముందుకి లాక్కుంటోంది! కాని, ఆమె కాలుని వెంటాడుతోన్న బూటు కాలు తన ప్రయత్నం మానటం లేదు. ఆమె కాలుని మరీ దూరంగా జరిపేస్తే, రెండు సీట్ల మధ్యనున్న ఖాళీలోంచి ఆమె నడుముని పరామర్శిస్తున్నాయి చేతి వేళ్ళు.

పద్మావతికి గుండె దడ దడ లాడుతోంది. ఏదో అవమానపు భావం ఆమెని బాధ పెడుతోంది. ఏడుపొచ్చేస్తోంది. పోనీ, భర్తతో చెబుదామా అంటే చాలా భయం వేస్తోంది ఆమెకు. అసలే తిక్కమనిషి, వాదనమూ. ఏం అల్లరి చేస్తాడో, ఏం గొడవ పడతాడో అని భయం. చెప్పకపోదామా అంటే వెనకాల వెధవలు అలుసుగా తీసుకుని, మరీ చొరవ చేస్తున్నారు! ఏంచెయ్యాలో పాలుపోవడం లేదామెకు.


శ్రీనివాసరావు తన కాలిని ఎవరో వెనక నుంచి బూటు కాలితో తంతున్నట్లు ఫీలయ్యాడు. పొరపాటేమో అనుకుని రెండు మూడుసార్లు సర్దుకున్నాడు. మరోసారి, ఇంకోసారి...ఏదో బూటు కాలు నెమ్మదిగా తగుల్తోంది తనకి. అటూ ఇటూ పూరికే తెగ కదుల్తోన్న భార్య వైపు తిరిగాడు.

"ఏవిటది? తిన్నగా కూర్చోలేవూ? ఎందు కలా పూరికే గింజుకుంటావు?" కసిరేడు పెళ్ళాన్ని.

పద్మావతికి దుఃఖం వచ్చేస్తోంది. భర్త చెవి దగ్గర నోరు పెట్టి, ఫిర్యాదు చేసింది తన ఇబ్బంది గురించి.

"సర్లే! సరిగా సర్దుకుని కూర్చో...వెధవ పితూరీల నువ్వూనూ" అని కొంచెం గట్టిగా కసిరాడు భార్యని. ఫరవాలేదు. వెనక వెధవలకి కొద్దిగానైనా వినిపించే ఉంటుంది అనుకున్నాడు. అత నను కున్నట్లుగానే స్పష్టంగా కాకపోయినా, పద్మావతిని కసరడం వెనక కుర్రాళ్ళకి వినిపించింది. టక్కున వాళ్ళు బుద్ధిమంతులైపోయారు.

మొగుడుకూడా తననే తిట్టేసరికి పద్మావతికి దుఃఖం కట్టలు తెంచుకుంది. ఏమాత్రం ధ్వని పైకిరాకుండా నోట్లో పైటకొంగు కుక్కుకుని నిశ్శబ్దంగా రోదిస్తోంది. చెక్కిళ్ళపై నుంచి ధారా




మాకు టెలీఫోన్ బిల్ విపరీతంగా పెరిగిపోతోందోయ్.. అందుకని!!

పాతంగా జారుతున్నాయి కన్నీళ్ళు.

'నేను శుద్ధ చేతకాని వెధవని! పెళ్ళాన్ని కాపాడు కోలేని చవటని. చివరికి ఏం చెయ్యలేక పెళ్ళాం మీద చూపించాను ప్రతాపాన్ని. కాని, ఏం చేయను— పదిమందిలోను లేచి నిలబడి గొంతు చించుకుని, నా పెళ్ళాన్ని చీకటిచాటున చేతులేసి తడుముతావురా, వెధవా? అని అల్లరి పడనా! అందరూ నన్నూ, నా పెళ్ళాన్నే చూడరూ? ఎంత నామర్దా ?' అను కున్నాడు.

• • • •

చీకటిలో భూతంలా దూసుకుపోతోంది బస్సు. అందరూ గాఢంగా నిద్రపోతున్నారు. అర్ధరాత్రి కావస్తోంది.

తమ ఆట ఇంక తమకే విసుగొచ్చినట్లుంది,— ఆ కుర్రాళ్ళిద్దరూ గాఢంగా నిద్దరోతున్నారు— అల్లరి మానేసి.

ఏడ్చేడ్చి అలసిపోయి పసిపాపలా నిద్రపోతోంది పద్మావతి.

ఆలోచనల వేడి, ఉక్రోషపు సెగ అతనిని ప్రశాంతంగా నిద్ర పోనివ్వడం లేదు. నిద్రమత్తు, అర్ధ రాత్రి, చల్లగాలి, బస్సు తూగు అతనిని అశాంతితో మేలుకోనివ్వడం లేదు. నిద్రకీ, మెలుకువకీ మధ్య వూగిసలాడుతున్నాడు శ్రీనివాసరావు.

కోటినాగులుకి నిద్ర పట్టడం లేదు. అలసట, నీరసం అతని ముఖం మీద బరువు వాలి ఉన్నాయి. అయినా కోటినాగులు నిద్రపోవడం లేదు.

త్రుళ్ళిపడ్డాడు శ్రీనివాసరావు. మళ్ళీ తగిలింది తనకి ఆ బూటుకాలు! మళ్ళీ ... ఇంకోసారి!!

పక్కకి తిరిగి భార్యను చూశాడు. ప్రశాంతంగా నిద్రపోతోంది. అంటే ... అంటే ... నిద్దర్లో ఆమె ఎలాగా తెలుసుకోలేదు గదా అని మరీ చొరవ తీసేసుకుంటున్నారా ఆ చండాలపు వెధవలు? ఎంత అమానుషం! ఎంత అసహ్యం! కుతకుత ఉడికి పోయింది. అతనిలో ఏదో తెగింపు! పిచ్చి ఆవేశం! ఉద్రేకంతో రక్తనాళాలు తెగిపోతాయా అన్నంత టెన్షన్ చోటు చేసుకుంటోంది అతనిలో! ఇంతలో మరోక్కసారి మళ్ళీ తన కాలువద్ద కదలిక!

చరాల్న వెనక్కి తిరిగాడు శ్రీనివాసరావు. ఆ కుర్రాళ్ళిద్దరూ కాళ్ళు సీట్ల మీదికి ముడుచుకుని గాఢంగా నిద్దరోతున్నారు. ఇంక కింద నున్నకాళ్ళు కొద్ది మెలుకువ ఉన్న వ్యక్తి కోటినాగులు! ...

"ఫా ...ట్ " మన్న చప్పుడికి బస్సులో అందరూ ఒక్కసారి త్రుళ్ళిపడి లేచారు. తేరుకొనేలోగా మరోసారి పెఠేల్, మన్న ధ్వని అందరి గుండెల్ని జలదరింప జేసింది!

ఏమయ్యింది? వెనుక టైరుగాని పేలి పోయిందా? ఇంకా అనుకోవడం పూర్తి కాలేదు. మరో సారి ఆ చప్పుడు దాని వెనకాలే 'నరికేస్తాన్రా లంజా కొడకా!" అన్న భయంకరమైన కేక అందర్నీ నిలువునా వణికించాయి! బస్ సడన్ బ్రేక్‌తో కీచు మని చప్పుడు చేస్తూ ఆగిపోయింది! బస్సులో లైట్లు వెలిగాయి!

"ఏమయింది? ఏమయింది?" అంటూ అందరూ ఆదుర్దాగా అటు చూశారు.



నువ్వనుకున్నదానికంటే తక్కువే కర్చు పెట్టావ్ — కొడుకన్న-కానీ నేననుకున్నదాని కంటే ఎక్కువ కర్చుపెట్టావని అంటున్నా...

వీరభద్రుడిలా నిలబడి ఉన్నాడు శ్రీనివాసరావు. వూదితే ఎగిరిపోయేలా ఉన్న అతను ఉద్రేకంతో వూచలా వూగుతున్నాడు. అతని అరిచేతులురెండూ గాలిలోకి విసురుగా ఎగురుతూ కోటినాగులు చెంపల్ని డప్పుల్లా వాయించేస్తున్నాయి. అప్పటి కప్పుడే పదో, డజనో దరువులు పూర్తైపోయాయి!

కోటినాగులు కూర్చున్న చోటు నుంచి అరం గుళం కూడా కదల్లేదు! కనీసం డప్పుల్లా పేలిపో తోన్న చెంపలకి చేతులైనా అడ్డు పెట్టుకోలేదు. రెండు బుగ్గలూ, బుస బుస పొంగి వాచిపోయాయి అప్పటికే! కాని, అతను నిలువునా బిగుసుకుపోయి కూర్చుని ఉన్నాడు తప్ప ఏమాత్రం కదలలేదు!

కోటినాగులు ముఖంలో భయంలేదు. బాధలేదు. ఉన్నదల్లా ఒకే ఒక్క భావం...అంతులేని ఆశ్చర్యం! విచిత్రమైన ఆశ్చర్యంతో చూస్తున్నాడు శ్రీనివాస రావు వీర నృసింహావతారాన్ని! పది పదిహేను దెబ్బలు తిన్న తరవాత, తన ఆశ్చర్యంలోంచి కొద్దిగా తేరు కుని, "ఎందుకండీ? ... ఎందుకు? ... ఎందుకు?" అంటున్నాడు అయోమయంగా.

పక్కనున్న కుర్రాళ్ళు, బిక్కచచ్చిపోయి చూస్తు న్నారు. నిద్రలోంచి త్రుళ్ళిపడి లేచిన పద్మావతి, భర్తని అయోమయంగా చూస్తోంది.

"అయ్యో అయ్యయ్యో ! అదేమి టదేమిటి? ఏం జరిగింది? ఆపండాపండి! అతన్ని ఆపండి. పట్టుకోండి! అరెరే!" అంటూ బస్సులో జనం యావన్మందీ చుట్టూ మూగిపోయారు. కండక్టరు పరుగున వచ్చి గుంపును తోసుకుంటూ ముందు కొచ్చి శ్రీనివాసరావుని పట్టుకొన్నాడు.

శ్రీనివాసరావు గింజుకున్నాడు. శివాలాడిపో తున్నాడు. "చంపేస్తాన్రా! ... రేయ్! నిన్ను ... నిన్ను ..." అరుస్తున్నాడు.

ఒక్క వూపు వూపి విలబెట్టాడు డ్రయివరు శ్రీనివాసరావుని. "ఏం జరిగిందో చెప్పండి?" చిరాగ్గా గట్టిగా అరిచాడు.

అప్పటికి తిక్క కుదిరింది శ్రీనివాసరావుకి. చుట్టూ చూశాడు. ఒకసారి జుట్టు సవరించుకుని, ఎర్రబడ్డ మొహంతో మౌనంగా తన సీట్లో కూర్చున్నాడు.

కోటినాగులులో ఏ మార్పూ లేదు. బొమ్మలా అలాగే కూర్చున్నాడు—కనీసం చెంపలైనా సవరించు కోకుండా. అతని ముఖంలో అదే ఆశ్చర్యం! ముక్కు లోంచికొద్దిగా నెత్తురోస్తోంది. కనీసం తుడుచుకో లేదు.

"ఏం జరిగిందో చెప్పమంటే, మాట్లాడ రేమండీ? కనీసం మీరైనా చెప్పండి?" కోటి నాగుల్ని అడిగాడు డ్రయివరు అనుమానంగా.. అందరూ ఆశ్చర్యంగా ఆత్రతతో చూస్తున్నారు.

"ఏమో! అదే నాకూ తెలవటం లేదు. ఉన్నట్టుండి నా మీద విరుచుకు పడిపోయా డాయన!" నెమ్మదిగా అన్నాడు కోటినాగులు.

అందరూ అనుమానంగా చూస్తున్నారు. ఎవరికీ ఏం అర్థం అవటం లేదు.

"మరైతే మీ రెందుకూరుకున్నారు?" ఎవరో అన్నారు.

"అసలు సంగతేటో, ఈ సడన్ ఎటాకేటో నాకే అర్థం కాక ఆశ్చర్య పోతున్నాను. మంచి నిద్దట్లో ఉన్నాను. ఉన్నట్టుండి టపీటపీమని ఎవడో నా సెంపల్ని సితక్కొడుతుంటే లేచాను. చూస్తే ఏటుంది?" ఇంకా ఆశ్చర్యంలోంచి తేరుకోలేనట్లుంది.

"ఆ పెద్దమనిషిని విలదియ్యండి! అటెటో చూస్తూ ఏం పట్టనట్టు కూచుంటా డేటి?" ఉద్రేకంగా అరిచా రెవరో.

డ్రయివరుకు చాలా చిరాకేసింది. శ్రీనివాసరావు వైపు కటినంగా చూస్తూ—"ఏం జరిగిందో చెప్ప మంటే మాట్లాడ వేటయ్యా? ఎందు క్కొట్టావు? అంతా నీ ఇష్ట మేనేటి? ఎవణ్ణి బడితే వాడిని చిత గ్గొట్టేసి, కిక్కురుమనకుండా కూచుంటే వూరు కుంటారేటి చుట్టుపక్కలోళ్ళు? చెప్పు... ఎందు క్కొట్టావు?" నిలదీశాడు.

శ్రీనివాసరావు మొహంలో టెన్షన్ తగ్గలేదు అతను చుట్టూ చూస్తూ కండక్టరుతో "అతను గంట నుంచీ అదే పనిగా నా కాలు తొక్కుతున్నాడు. నే నెంత తప్పించుకున్నా, మళ్ళీ మళ్ళీ అదే పని చేస్తూ నా నిద్రని చెడగొడుతున్నాడు" అని చాలా నెమ్మదిగా అని, మళ్ళీ ఎటో చూస్తూ కూర్చు న్నాడు.

ఈ సమాధానం అక్కడున్న ఎవ్వరికీ నచ్చలేదు. అదేదో పొగరుబోతు సమాధానంలా ఉంది. అందరూ కోటినాగులు వైపు చూశారు.

కోటినాగులు ముఖంలో ఆశ్చర్యం చాలా భాగం తగ్గినా, ఇంకా కొద్దిగా ఉండిపోయింది. ముక్కు నుంచి కారుతూన్న నెత్తురు తుడుచుకున్నాడు. చెంపలు సవరించుకున్నాడు. జుత్తు సర్దుకున్నాడు. నెమ్మదిగా అన్నాడు—

"మూడ్రోజుల బట్టి నిద్ద రస లేదండీ! ఒళ్ళు తెలీకుండా నిద్దరోతున్నాను. నాకు తెలీకుండా

నా కాలు గాని ఆయనకు తగిలిందేటో!''

బస్సులో అందరికీ పూర్తి అసంతృప్తి కలిగింది. ఏదో జరిగింది. అది తెలీటం లేదు. ఏదో జరగాలి! అది జరగలేదు! నేరం ఫలానా వారిది అని స్పష్టంగా తెలిస్తే బాగుండేది! అందరి చేతులూ, శిక్ష విధించ డంల భాగం పంచుకుని ఉండేవి. అది జరగలేదు. దెబ్బలు తన్నిన వాడూ, తిన్నవాడూ ఇద్దరూ రగడ పెంచకుండా పూరుకున్నారు. ఇంక మధ్య వాళ్ళు తాము చెయ్య గలిగేదేముంది? అందుకే అసంతృప్తి!

బస్సు మళ్ళీ బయులుదేరింది. మళ్ళీ లైట్లారి పోయాయి. ఈ సారి ఎవ్వరూ నిద్ర పోలేదు. అందరి అసంతృప్తి రకరకాల అభిప్రాయాల రూపంలో బయట పడ తూంది.

“అంత మాత్రానికే ఇంతలా చావగొట్టాలా, పొగరుబోతురవం కాకపోతే...”

“ఇతను తిరగబడి తంతే ఒక్క దెబ్బకి అతను బంతిలా దొర్లుతాడు. ఇతడు కిక్కురుమనకుండా ఎందు కూరుకున్నాడో మరి!”

“ఏదో లొసు గుంటుంది! లేకపోతే పూరు కుంటాడా? చీకటి మాటున ఆ ఆడమనిషిని చెంగు పవరించి ఉంటాడు. అతను పైకి చెప్పుకోవడానికి సిగ్గు పడ్డాడేమో! ఇతను తిరగబడితే అతనూ, ఆ పిల్లా అసలు సంగతి సిగ్గు విడిచి చెప్పేస్తే. ఇతని పీపు చీరీరా అందరూ? అందుకనే పూరుకుని ఉంటాడు!”

“ఈ కుర్రాడు చాలా మంచివాడు లాగున్నాడు. అందుకే పూరుకున్నాడేమో!”

ఆ యువకు లిద్దరూ తేలు కుట్టిన దొంగల్లా కిక్కురుమనకుండా కూర్చున్నారు.

కోటినాగులు కిందికి వంగి మరో సిగరెట్ వెలిగించుకుని, కాళ్ళూ, చేతులూ దగ్గరికి ముడుచు కుని సర్దుకుని కూర్చున్నాడు. అతని మొహంలో ఆ కొద్దిపాటి ఆశ్చర్యం ఇంకా చెరిగి పోలేదు.

పద్మావతి భర్త చెవిలో, “పాపం అన్యాయంగా చావగొట్టే రతన్ని! నన్ను అల్లరి పెట్టిన వెధవలు ఆ వెనకాల కూర్చున్న వాళ్ళు పాపం. అసలతను నా వేపే చూడలే దెప్పుడూ! ఉన్నట్లుండి అలాటి పని చేశా రెందుకూ?” అని గుస గుస లాడింది.

శ్రీనివాసరావు తెల్లబోయాడు. అయితే అతని కాలు నిద్రమత్తులోనే తనకి తగిలిందన్నమాట!

‘అన్నా! ఎంత పన్జేశావూ! అన్యాయంగా పాపం మాట గిట్టుకున్నావే! ఆ మున్గురూ ఒకే జాట్లు అనుకున్నందువల్ల వచ్చిందీ చిక్కు. పాపం అత నెంత మంచివాడు! అన్ని దెబ్బలూ తిని, పల్లెత్తు మాటైనా అనలేదు నన్ను! తిరగబడి చెయ్యి విసిరితే తన గతేమయ్యేది! అలాంటి మంచివాణ్ణి అవమానించ డం మరీ పాపం! స్వామీ! ఏడుకొండలవాడా! నా పాపాన్ని క్షమించు! పశ్చాత్తాపం శ్రీనివాసరావుని దహించేస్తూంది! ఆ పశ్చాత్తాపం మాటున ఒక చిన్న అనుమానం అతని మనస్సులో అస్పష్టంగా దొలుస్తూంది. “అవునూ! నేను మరి ఇంత అన్యా యంగా చెయ్యి చేసుకుంటూంటే, మరీ ఎంత మంచి వాడైతే మాత్రం, మరీ అంత శాంతంగా ఎందు కూరుకున్నా డబ్బా!’ ఈ అనుమానం పెనుభూతంగా




మారకుండా అతని పశ్చాత్తాపాన్ని ఆపేసింది.

బస్ ఆగింది. కోటినాగులు లేచి దిగి పోతున్నాడు. శ్రీనివాసరావు లేచి కోటినాగులు రెండు చేతులూ పట్టుకుని, “క్షమించండి! చాలా తొందర పడి పోయాను. ఏదో. నిద్ర బాగా చెడిపోయేసరికి, ఆవేశం ఆపుకోలేకపోయాను!” అన్నాడు.

కోటినాగులు సూటిగా శ్రీనివాసరావు ముఖంలోకి చూశాడు. అతని కళ్ళల్లో ఆశ్చర్యం ఇంకా తగ్గి పోయినా చాలా కొద్దిగా మిగిలి పోయింది. ఆ కొద్ది భాగాన్ని మాటల్లో పెట్టి, “అదేటి బ్రెదరూ! మరీ అంత కోపమేటి? నాకూ వస్తాది కోపం! కోపం వచ్చినాది గనా అని నిన్ను నాలుగు పీకినానంటే ఏమై పోతావు? కుర్రోడివి, బక్కోడివి గనా అని నేను ఆలోసించి ఆగిపోలేదా? అలాగే కోపం రాగానే సరిగాదు, కాస్త ఎనకా ముందూ సూసుకోవాల!” అని చిన్న గీతా బోధ చేసి దిగిపోయాడు. అతని ఉపన్యాసం విన్న బస్సులో అందరికీ శ్రీనివాసరావుతో సహా అతని మీద గౌరవభావం పెరిగింది. దాంతో అందరూ మరో కాస్సేపు శ్రీనివాసరావుని చీవాట్లు వేశారు. శ్రీనివాసరావుకి బాధ కలగ లేదు. పశ్చాత్తాపం మాత్రం బాగా పెరిగి పోయింది. ‘ఎంత మంచి వాడు! ఛీఛీ! ఎలాటి వెధవ పని చేశాను! భగవంతుడా! నాకేదైనా ప్రాయశ్చిత్తం కలిగించు!’

● ● ●

బస్సు స్టేషన్ నుంచి బయలుదేరి నడుస్తున్నాడు కోటినాగులు. నడుస్తూ ఆలోచిస్తున్నాడు. మధ్య మధ్య మంటెత్తి పోతూన్న చెంపల మీద చేత్తో రాసుకుంటున్నాడు.

‘ఇదేటీడూ? తిక్కముండా కొడుకేటి? సిత్రం గున్నాదే. ఏటి కాలు పొరపాట్న తగిలితేనే సావ గొట్టేస్తాడా? బలే! సావు దెబ్బ తినేస్త దెక్కడో! మరొకప్పుడైతే పేసు ల్దేసీ ద్దును! కదల్డాని కీల్లేక పోయింది గాని! యెంకన్నసామీ! ట్రిప్పు యేస్నట కాలేదు. సిన్న సిన్న పిలక్కొట్టుళ్ళు మనకి అలవాట్లే దన్నది నీకు తెలుసు గదన, నా కాలి కిందికి దెచ్చిచ్చినా వన్నమాట పెద్ద బేరాన్ని! ఎంటుంటాది? ఏదో గాని చాలినంత ఎక్కువగానే ఉండి ఉంటాది! అవును గాని అది ఆ తిక్క సన్నాసిగాడిది గాని కాదు కదా? ఆడి ముకం జూస్తే ఆ డెప్పుడేనా అంత కళ్ళ జూసుంటాడా అనిపిస్తాది. ఆడిదై ఉండదు. ఆడి నుండేవడో బాగా బలిసిన పందికొక్కు నాయాల కూసుని ఉంటాడు. అయినా ఎవుడైతే మనకేటి? ఆడి జేబిలో కనిపించుంటే, బ్లేడుకి పని పడి ఉండేది. చేతికి మట్టంటుకోకుండా సరాసరి కాలి కింది కొచ్చి పడింది నా లచ్చిమి! ఎటైనా ఆట మనదే! ఎవుడైనా ఎతుక్కుంటే కాలు తీసేసి జెంటిల్మెన్నై పోవచ్చు. లైటేసేసి సుట్టూ నలుసురూ పోగయి పోయి సరికి కాలు కదపడాని కీల్లేకపోయింది! సీ! అబ్బ! సమయం చూసి సెంప పేల గొట్టేసి నావురా, ఎలక నా కొడకా! అంతే ట్లే, పోలీసుల దెబ్బల కన్న నయివే! కిట్టుబాటుకూడా సరిపోయింది!’

నడుస్తూ సెంటర్లో కొచ్చాడు. సెంటర్లో ఏదో హరికథా కాలక్షేపం జరుగుతూంది!

“అంచేత నాయన్లారా! స్వర్గం, నరకం అంటూ వేరే ఎక్కడో ఉండవు. ఈ లోకంలో, ఈ జన్మలో మనం చేసే పాప పుణ్యాల ఫలితం, ఇక్కడే ఈ జన్మలోనే ఏదో ఒక రూపంలో అనుభవించేస్తాం!” హరిదాసుగారి మాటలు కోటినాగులు చెవిలోదూరాయి. చిన్నగా నవ్వుకున్నాడు. తరవాత ఫకాల్న నవ్వాడు.

‘నిజమే, సామీ, పచ్చి నిజం! అందుకనే కాబోలు యెంకన్న సామి నేరం, సిచ్చ కలిపి రెండూ ఒకేసా రిచ్చేశాడు నాకు. నా జేబులో యేసుకున్నది పాపం అయితే, సెంపల మీద పరిహారంకూడా పెల్లి పోయింది. లెక్క సరిపోయింది!’ అనుకుంటూ, చీకట్లో కలిసి పోయాడు కోటినాగులు.

● ● ● ●

గొల్లుమన్నాడు శ్రీనివాసరావు! గగ్గోలు పెట్టేసింది పద్మావతి! ఒకటా, రెండా... రెండు వేల అయిదు వందలు! కష్టార్జితం. బాధ పడి, బెంగ పడే ఓపిక అయిపోయాక ఆలోచనలో పడ్డాడు శ్రీనివాసరావు.

‘బస్సులో జారి పోయేనా ఉండాలి! ఎవడేనా కొట్టేసినా ఉండాలి! ఎవడు కొట్టేసుంటాడు? ఏమో! అతన్ని కొడుతున్నప్పుడు బస్సులో జనం అంతా మూగిపోయి, మీద పడి పోయారు కదా! వాళ్ళల్లో ఎవడేనా కావచ్చు! కొంప దీసి అతను గాని కాదు కదా! ఛీ! ఛీ! వెధవాలోచన! పాపపుటాలోచన. ఇప్పటికే అతని పట్ల చెయ్యరాని నేరం చేశాను! పైగా ఇదో అభాండమా! పుట్ట గతులుంటాయా నాకూ.’

అతని ఆలోచనల మధ్య లోంచి అతని మనస్సులో ఎక్కడో మారుమూల అస్పష్టంగా ఉన్న అనుమానం మరొక్కసారి పదిలింది.

‘అవునూ! మరీ ఎంత మంచివాడైతే మాత్రం. మరీ అంత బొత్తిగా ఎందు కూరుకున్నాడూ?’

ఈసారికూడా పశ్చాత్తాపం అతని అనుమానాన్ని ఆర్పేసింది. ‘పైన భగవంతుడు లేడూ? పాపాన్ని చూడడూ? నేను చేసిన పాపానికి ఇంతకన్నా ప్రాయ శ్చిత్తం ఇంకేం చెయ్యాలి? వెంకటరమణా! నాకు తగిన శాస్తి చేశావు. సరిపోయింది!’ అయినా... అయినా ఇదంతా, దీనివల్ల వచ్చింది. ఈ పెళ్ళాం కాదు గానీ భగవంతుడా!...’ ★